సాక్షి తూర్పుగోదావరి

ఆదివారం । 22 । జనవరి । 2023



రూ.50 వేల అందజేత


అమలాపురం టౌన్: వేంకటేశ్వర ఆలయ అభివృద్ధికి వెంకట సాయి ఆక్వా నీడ్స్ యజమాని మంతెన వెంకట రామరాజు, షర్మిల దంపతులు (అమలాపురం) రూ.50 వేలు సమర్పించారు.



నిత్యాన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి లంక శ్రీరామమూర్తి (మచిలీపట్నం) శనివారం రూ.2 లక్షల విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 9,450 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,850, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 4,800 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

నేడు కానిస్టేబుల్ రాత పరీక్ష

జిల్లాలో 29 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో ఆదివారం కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి రాత పరీక్ష జరుగనుంది. దీనికి గాను 29 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ ఎం.రజినీ శనివారం వెల్లడించారు. 9,343 మంది పురుషులు, 3,081 మంది మహిళా అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం తొమ్మిది నుంచి ఒంటి గంట వరకూ పరీక్ష జరుగనుంది. దీని నిర్వహణకు 29 మంది ఎస్సైలు, 74 మంది హెచ్‌సీలు, 107 మంది కానిస్టేబుళ్లు, 47 మంది మహిళా కానిస్టేబుళ్లు, పది మంది హోంగార్డులు విధులు నిర్వర్తించనున్నారు. ఇద్దరు సీఐ బృందాలను ఫ్లయింగ్ స్క్వాడ్‌గా ఏర్పాటు చేశారు. జిల్లాలో రాజమహేంద్రవరంతో పాటు అనపర్తి, కొవ్వూరు ప్రాంతాల్లో పరీక్షలు జరగనున్నాయి. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు.

'నన్నయ'లో మహిళా క్రికెట్ జట్టు ఎంపికలు



ఎంపికైన మహిళా క్రికెట్ జట్టుతో సభ్యులు

రాజానగరం: స్థానిక ఆదికవి నన్నయ యూనివర్సిటీలో స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో శనివారం మహిళా క్రికెట్ జట్టు ఎంపికలు జరిగాయి. 16 మంది క్రీడాకారులను యూనివర్సిటీ టీమ్‌గా ఎంపిక చేశారు. మైసూరులో ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 5 వరకూ జరిగే సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడా పోటీలలో వీరు పాల్గొంటారు. వీరికి టీమ్ మేనేజర్‌గా యూనివర్సిటీ క్రికెట్ కోచ్ వి.సులోమాన్ దేవానంద్ వ్యవహరిస్తారు. జె.సునీల్ (నర్సాపురం), ఎస్.విజయసారథి (పెనుగొండ)లు సెలక్షన్స్ కమిటీ సభ్యులుగా వ్యవహరించారు. స్పోర్ట్స్ బోర్డు కోఆర్డినేటర్ డాక్టర్ కె.సుబ్బారావు, సెక్రటరీ డాక్టర్ బి.రామగోపాల్ క్రీడాకారులను అభినందించారు.

టీచర్ల ప్రమోషన్ కౌన్సెలింగ్ పూర్తి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాలో ప్రమోషన్ వెసులుబాటు ఇచ్చిన ఉపాధ్యాయులకు శనివారం నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయింది. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ఆధ్వర్యంలో జీవశాస్త్రం 18, ఇంగ్లిష్ 41, గణితం 28 పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించారు.. ఈ నెల 18న కాకినాడలో జరిగిన కౌన్సెలింగ్‌లో చాలా మంది అనాసక్తి చూపడంతో మరో అవకాశం ఇచ్చారు. విద్యా శాఖాధికారి కార్యాలయ ఏడీ.వెంకటరాజు, రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఎం.తిరుమల దాస్, అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

భక్తులతో రత్నగిరి కిటకిట

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. సుమారు 30 వేల మంది స్వామివారిని దర్శించారు. వారిలో సగం మంది భక్తులు ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చినవారే. ఆలయం వద్ద తీవ్ర రద్దీ ఏర్పడింది. భక్తులు సత్యదేవుడిని దర్శించిన అనంతరం సప్త గోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావి చెట్టు వద్ద జ్యోతులు వెలిగించి ప్రదక్షిణ చేశారు. 1,500 స్వామివారి వ్రతాలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ. 30 లక్షలు ఆదాయం సమకూరింది. సుమారు ఐదు వేల మందికి ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. శనివారం పర్వదినం కావడంతో తిరుచ్చి వాహనం మీద సత్యదేవుని ప్రాకారసేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి తూర్పు రాజగోపురం వద్ద ఆలయప్రాంగణంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేశాక ఆలయ ప్రాకారంలో మూడు సార్లు ఊరేగించారు. ధనుర్మాసోత్సవాలు అనంతరం తొలిసారిగా స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ఊరేగించారు.

కొలువుల చికిత్స



ఉమ్మడి 'తూర్పు'న డీఎంఅండ్‌హెచ్‌ఓల పరిధిలో పోస్టుల భర్తీ ఇలా

ఆర్ఎంసీ, కాకినాడ	జీజీహెచ్, కాకినాడ	వైద్య కళాశాల, రాజమహేంద్రవరం	టీచింగ్ ఆస్పత్రి, రాజమహేంద్రవరం	డీసీహెచ్ఎస్	డీఎంహెచ్ఓ
7	11	42	109	103	49



స్టాఫ్ నర్సుగా ఎంపికైన యువతికి నియామక పత్రం అందిస్తున్న ఆర్డీ డాక్టర్ పద్మా శశిధర్

- వైద్య, ఆరోగ్య శాఖలో ఉద్యోగాల విప్లవం
- ఖాళీ పోస్టులన్నీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో భర్తీ
- ఉమ్మడి 'తూర్పు'న 3 వేల నియామకాలు
- ఇప్పటికే 1,186 మిడ్‌లెవెల్.. 26 కేడర్లలో మరో 321 పోస్టుల భర్తీ

సాక్షి, రాజమహేంద్రవరం: అందుబాటులో లేని వైద్యులు.. అరకొర సిబ్బంది.. చాలీచాలని మందులు.. సౌకర్యాల లేమి.. ఇటువంటి అనారోగ్యాలతో సతమతమవుతున్న ప్రభుత్వాసుపత్రులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మూడేళ్లుగా అవసరమైన చికిత్స చేపట్టింది. 'నాడు–నేడు'తో ఆస్పత్రుల అభివృద్ధికి నాంది పలుకుతూనే.. మౌలిక వసతుల కల్పనకూ ప్రాధాన్యం ఇచ్చింది. మరోపక్క వైద్య, ఆరోగ్య రంగంలో ఏ ఒక్క పోస్టూ ఖాళీగా ఉండరాదన్న ఉద్దేశంతో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగాల విప్లవానికి శ్రీకారం చుట్టింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఈ శాఖలో ఇప్పటి వరకూ సుమారు 3 వేల ఉద్యోగాలు భర్తీ చేశారు.

గతంలో వైద్య, ఆరోగ్య శాఖలో ఒక్క పోస్టు భర్తీ చేయాలంటే సంవత్సరాల కాలం పట్టేది. వైద్య విద్య పూర్తి చేసుకున్న వారు, నర్సింగ్ శిక్షణ పొందిన వారు, వివిధ టెక్నీషియన్లు నోటిఫికేషన్ కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చేసేవారు. ఒకవేళ నోటిఫికేషన్ ఇచ్చి నా అరకొర పోస్టులతో ఉద్యోగ సాధన కష్టంగా మారేది. మామూళ్లు ముట్టజెప్పిన వారికే అగ్రతాంబూలం వేసేవారు. దీంతో అర్హులకు అన్యాయం జరిగేది.

ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవు. ప్రభుత్వ వైద్య రంగం అభివృద్ధికి, వైద్య, ఆరోగ్య శాఖ మెరుగుదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారు. నిత్యం ఏదో ఒక పోస్టు భర్తీకి నోటిఫికేషన్ ఇస్తున్నారు. అర్హత, మెరిట్, సామర్థ్యం ఉన్న వారికి మాత్రమే ఉద్యోగాలు వచ్చేలా సంస్కరణలు చేపట్టారు. ఎవ్వరికీ ఒక్క రూపాయి కూడా చెల్లించకుండానే పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రభుత్వం పారదర్శకంగా చేపట్టింది. ప్రతి 6 నెలలకోసారి ఏదో ఒక నోటిఫికేషన్ ఇస్తూ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తోంది. మెరిట్ ప్రాతిపదికగా ఎలాంటి అవకతవకలకూ తావు లేకుండా పోస్టులు భర్తీ చేస్తోంది. ఫలితంగా అర్బన్ హెల్త్ సెంటర్లు, పీహెచ్‌సీలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఇతర అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మేరకు సిబ్బంది ఉంటున్నారు. దీంతో వైద్య సేవల్లో ఎటువంటి జాప్యమూ జరగడం లేదు.

ఆర్డీ పరిధిలో మూడేళ్లుగా భర్తీ చేసిన ఉద్యోగాల్లో కొన్ని..

జిల్లా	విలేజ్ హెల్త్ క్లినిక్‌లు	ఎంఎల్‌హెచ్‌పీ స్టాఫ్ నర్సులు
కాకినాడ	410	400
తూర్పు గోదావరి	368	367
కోనసీమ	432	419
అల్లూరి సీతారామరాజు	112	71

పోస్టులు భర్తీ చేశారిలా..

- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 1,240 గ్రామ/వార్డు సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాల యంలో ఒక్కో హెల్త్ సెక్రటరీ (ఏఎన్ఎం) చొప్పున 1,240 మందిని నియమించారు. వీరు సచివాయాల పరిధిలో ఆరో గ్య కార్యక్రమాలను పర్యవే క్షించడంతో పాటు వారి పరిధిలో ప్రథమ చికిత్స సేవలు అందిస్తున్నారు.
- గ్రామీణ ప్రాంతాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో వైద్య సేవలు అందించేందుకు బీఎస్సీ నర్సింగ్ విద్య పూర్తి చేసిన అభ్యర్థులను మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు(స్టాఫ్ నర్స్)గా నియమించారు. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ జోన్–2 జోన్–2 (రాజమహేంద్రవరం) రీజినల్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) పరిధిలోని 8 జిల్లాల్లో ఇప్పటి వరకూ 2,698 మందికి ఉద్యోగాలు కల్పించగా.. ఒక్క ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే 1,186 ఉద్యోగాలు భర్తీ చేశారు. తాజాగా మరో 200 పైగా స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి మార్గం సుగమమైంది. త్వరలోనే వీరు సైతం విధుల్లో చేరనున్నారు. మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు గ్రామీణ ప్రాంతాల్లో వైద్యుల పాత్ర పోషిస్తున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్, ఆరోగ్యశ్రీ సేవలను దగ్గరుండి చూసుకుంటున్నారు. వారి పరిధిలో లేని సమస్య అయితే టెలి మెడిసిన్ ద్వారా పీహెచ్‌సీ, జిల్లా కేంద్రంలోని టెలి మెడిసిన్ హబ్‌కు వీడియోకాల్ చేసి వైద్యం అందిస్తున్నారు. ఫలితంగా చిన్నపాటి రుగ్మతలు, జబ్బులకు జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రులకు పరుగులు తీయాల్సిన బాధ తప్పుతోంది.
- కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) పరిధిలోని 26 క్యాడర్లలో 321 నియామకాలు చేపట్టారు. కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న పోస్టులకు మోక్షం కల్పించారు. వెరసి కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ), కాకినాడ ప్రభుత్వాస్పత్రి (జీజీహెచ్), రాజమహేంద్రవరం వైద్య కళాశాల, ఇక్కడి టీచింగ్ ఆస్పత్రి, జిల్లా ప్రభుత్వ వైద్య సేవల సమన్వయాధికారి (డీసీహెచ్ఎస్), డీఎంహెచ్ఓ పరిధుల్లో సిబ్బంది కొరత తీరింది.
- ప్రధానంగా అనస్తీషియా టెక్నీషియన్లు 10, రేడియోగ్రాఫర్ 13, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ 10, జనరల్ డ్యూటీ అటెండెంట్స్ 55, ఎంఎన్ఓ/ఎఫ్ఎన్ఓ 40, ల్యాబ్ అటెండెంట్ 16, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్–2 – 33, మార్చురీ/పోస్టుమార్టమ్ అటెండెంట్ 7, ఓటీ టెక్నీషియన్ 5, ఆఫీస్ సబార్డినేట్లు 20, ఫార్మసిస్ట్ గ్రేడ్–2 – 24, ప్లంబర్ 7, శానిటరీ అటెండర్/వాచ్‌మన్ 5, ఎఫ్ఎన్ఓ 20 చొప్పున ఉద్యోగాలు భర్తీ చేశారు. అవసరమైన శాఖల్లో అదనపు పోస్టులు సృష్టించి మరీ నియామకాలు జరిపారు.

చరిత్రాత్మక నిర్ణయం



వైద్య రంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండకూడదన్న ఉద్దేశంతో ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటున్నారు. మా పరిధిలో ఇప్పటికే రెండుసార్లు మిడ్ లెవెల్ స్టాఫ్ నర్స్ పోస్టులు భర్తీ చేశాం. ప్రస్తుతం మరికొన్ని పోస్టుల భర్తీ ప్రక్రియ జరుగుతోంది. పదేళ్ల అనంతరం ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ అవుతుండటం శుభపరిణామం. సిబ్బంది నియామకంతో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుంది.

- డాక్టర్ పి.పద్మా శశిధర్, రీజినల్ డైరెక్టర్, మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ జోన్-2, రాజమహేంద్రవరం

రోగులకు మెరుగైన వైద్యం



వైద్య శాఖలో ఏ ఒక్క పోస్టూ ఖాళీగా ఉండకూడదనే ప్రభుత్వ నిర్ణయంతో ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందుతుంది. ఈ స్థాయిలో ఎప్పుడూ ఉద్యోగాలు భర్తీ కాలేదు. భర్తీ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. మెరిట్‌ను ప్రాతిపదికగా తీసుకుంటున్నాం. మా పరిధిలో ఉన్న పోస్టులన్నీ దాదాపు భర్తీ అయ్యాయి.

- డాక్టర్ శాంతిప్రభ, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి, కాకినాడ

గృహ నిర్మాణాలను పూర్తి చేయండి

జిల్లా కలెక్టర్ మాధవీలత

రాజానగరం: పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల్లో లబ్ధిదారులు చేపట్టిన గృహ నిర్మాణాలను సత్వరమే పూర్తి చేసే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ కె.మాధవీలత అధికారులకు సూచించారు. సీఎం జగన్ వచ్చే ఉగాది రోజున సామూహిక గృహ ప్రవేశాలు చేపట్టాలని నిర్ణయించారని, అందుకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలన్నారు. శనివారం సంపత్‌నగరంలోని జగనన్న కాలనీని సందర్శించిన ఆమె అక్కడ జరుగుతున్న గృహ నిర్మాణాలను పరిశీలించారు. కొంత మంది లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కాలనీలో 89 గృహాలు మంజూరు కాగా, 37 నిర్మాణాలు పూర్తయ్యాయని, ప్రస్తుతం 29 నిర్మాణంలో ఉన్నాయన్నారు. మరో 23 గృహాల పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. ఇక్కడ ప్రజలు నివాసం ఉండేందుకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని ఎంపీడీఓ బి.రామారావు తెలిపారు. ఇందులో భాగంగా తాగునీటి సదుపాయాలకు రూ.33 లక్షలు మంజూరయ్యాయన్నారు. అలాగే పటిష్టమైన రోడ్లు నిర్మించేందుకు పనులు చేపట్టామన్నారు. సర్పంచ్ పి.రామకృష్ణ, ఎంపీటీసీ సదానందకిషోర్, డీపీఓ జగదాంబ, డీఈ పరశురామ్, తహసీల్దార్ పవన్‌కుమార్, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, ఇంజినీర్లు సంపత్‌కుమార్, కె.సుబ్బారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.



సంపత్‌నగరం జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

ఈనెల 30న నిడదవోలు రైల్వేగేటు మూసివేత

- రైల్వే ట్రాక్‌కు మరమ్మతు పనులు
- ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వాహనాల మళ్లింపు

నిడదవోలు : నిడదవోలులో నెహ్రూబొమ్మ సెంటర్‌లోని రైల్వే ట్రాక్‌కు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ప్రధాన రైల్వేగేటును ఈనెల 30 నుంచి పది రోజుల పాటు మూసివేయనున్నారు. తాడేపల్లిగూడెం రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ అల్లూరి రవి ఈ విషయం తెలిపారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ఆర్టీసీ ఉన్నతాధికారులకు శనివారం రైల్వేశాఖ ఉన్నతాధికారులు దీనిపై నోటీసులు అందజేశారు. రైల్వేశాఖ భద్రతా చర్యల్లో భాగంగా రెండేళ్లకు ఒకసారి రైల్వేగేటు లోపల ఉన్న రెండు ట్రాక్‌ల వద్ద మరమ్మతు పనులు చేపడుతున్నారు. రోజూ 200 రైళ్లకు పైగా ఈమార్గంలో రాకపోకలు సాస్తుంటాయి. ట్రాక్‌పై రైళ్ల భద్రతను దృష్టిలో పెట్టుకుని పనులు చేపట్టనున్నారు. మరమ్మతులు పూర్తయిన తరువాత ఫిబ్రవరి 8వ తేదీ నుంచి తిరిగి రైల్వేగేటు తెరవనున్నారు.

ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు

రైల్వేగేటు మూసివేసినా ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. తాడేపల్లిగూడెం నుంచి బస్ సర్వీసులు రాజమహేంద్రవరం, కొవ్వూరు, పంగిడి ప్రాంతాలకు వెళ్లడానికి వీలు లేకపోవడంతో గేటు వద్ద ప్రయాణికులను దింపేస్తారు. అక్కడ నుంచి రైల్వేట్రాక్ దాటుకుని ప్రయాణికులు బయటకు వచ్చి రాజమహేంద్రవరం వెళ్లేందుకు నిడదవోలు ఆర్టీసీ డిపో నుంచి ఐదు బస్‌లను నడపనున్నారు. రాజమహేంద్రవరం, కొవ్వూ రు, పంగిడి, దేవరపల్లి నుంచి ద్విచక్ర వాహనాలు మాత్రమే తాడేపల్లిగూడెం ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా చేరుకోవచ్చు. ముందుగా నిడదవోలులోని గణేష్‌చౌక్ సెంటర్ నుంచి గణపతి సెంటర్, సంతమార్కెట్, సుబ్బరాజుపేట మీదుగా సింగవరం, తాళ్లపాలెం గ్రామాల మీదుగా తాడేపల్లిగూడెం చేరుకోవచ్చు. తాడేపల్లిగూడెం నుంచి తాళ్లపాలెం, సింగవరం గ్రామాల మీదుగా నిడదవోలు చేరుకుని రాజమహేంద్రవరం వెళ్ళవచ్చు.

ప్రేమించిన వ్యక్తి మోసం చేశాడని ట్రాన్స్‌జెండర్ ఆత్మహత్య



ఆందోళన చేస్తున్న ట్రాన్స్‌జెండర్లు



ఆత్మహత్య చేసుకున్న ప్రణీత (ఫైల్)

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): పెళ్లి చేసుకుంటానని చెప్పి ఓ యువకుడు మోసం చేశాడనే మనస్తాపంతో ట్రాన్స్‌జెండర్ ప్రణీత (29) శనివారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...సింహాచలనగర్ ప్రాంతానికి చెందిన పట్టా శ్రీను అనే వ్యక్తి నాలుగు సంవత్సరాలుగా ట్రాన్స్‌జెండర్ ప్రణీతను ప్రేమిస్తున్నాడు. వివాహం చేసుకుంటానని చెప్పాడు. దీంతో ప్రణీత ఆర్థికంగా అన్ని అవసరాలు తీర్చింది. ఇటీవల పెళ్లి ప్రస్తావన తెస్తుంటే శ్రీను ముఖం చాటేశాడు. దీనిపై ప్రణీత నిలదీసింది. నిన్ను పెళ్లి చేసుకోనని శ్రీను గట్టిగా చెప్పడంతో మనస్తాపం చెందిన ప్రణీత ఈనెల 19న పురుగుల మందు తాగింది. ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తాడితోటలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. దీంతో ట్రాన్స్‌జెండర్ల సంఘ నాయకురాలు సోనీ నేతృత్వంలో ఆసుపత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. శ్రీనును కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళనకు దళిత సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు.

ఇంటి స్థలం కోసం అన్నదమ్ముల ఘర్షణ

ఒకరు మృతి..మరొకరికి గాయాలు

రాజానగరం: వారసత్వంగా వచ్చిన కొద్దిపాటి ఇంటి స్థలం కోసం అన్నదమ్ముల బిడ్డల మధ్య ఏర్పడిన గొడవ ఒకరు మృతికి కారణమైంది. మండలంలోని కలవచర్లలో శనివారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి. అనంతారపు గంగయ్య (67), అనంతారపు ముసలయ్యలు అన్నదమ్ముల బిడ్డలు. ఆరు పదుల వయస్సు పైబడినప్పటికీ ఇంటి స్థలాల కోసం కొన్ని సంవత్సరాలుగా వీరి మధ్య వాగ్వాదాలు జరుగుతూనే ఉండేవి. వారసులు కూడా ఈ గొడవల్లో శత్రువుల్లా మారిపోయారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం గంగయ్య, ముసలయ్యలతోపాటు వారి కుటుంబాలు దూషణలతో గొడవకు దిగాయి. చినికి చినికి గాలివానగా మారింది. కర్రలతో కొట్టుకునే వరకు వెళ్లింది. ఈ క్రమంలో ముసలయ్య వెదురు కర్రతో గంగయ్య తలపై బలంగా కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రిని కాపాడుకునేందుకు అడ్డుపడిన మృతుని కుమారుడు కృష్ణకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఇతడ్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, కుమారుడు, ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. అమ్మాయిలు వివాహాల అనంతరం అత్తారిళ్లకు వెళ్లిపోగా, కొడుకు, కోడలు, వారి పిల్లలు తల్లిదండ్రులతో ఉంటున్నారు. కేసును సీఐ కాశీవిశ్వనాథ్ ఆధ్వర్యంలో రాజానగరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



గంగయ్య (ఫైల్)



కొట్లాటలో చనిపోయిన గంగయ్య

వాడపల్లికి పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమా లు నిర్వహించారు. స్వామి వారు పూర్ణాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయాన్ని ప్రత్యేక పువ్వులతో అలంకరించారు.. స్వామి వార్ని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తమ మొక్కుబడులు తీర్చు కుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ఆల య ఆవరణలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఏర్పాట్లును ఆలయ కమీటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ కమీటీ సభ్యులు పెన్మెత్స సురేష్‌రాజు, మన్యం బాను, ఆలయ అర్చకులు ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

వైనాట్ 175 విజయానికి మీరే సాధకులు

- ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలను ప్రజలకు చేర్చేందుకే సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు
- రాష్ట్ర కో ఆర్డినేటర్ పుత్తా ప్రతాప్‌రెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: కొత్తగా ఏర్పాటు చేస్తున్న 5.2 లక్షల మంది గృహ సారథులే 2024 ఎన్నికల 'వైనాట్ 175' విజయ సాధనలో కీలక భూమిక పోషించనున్నారని జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల రాష్ట్ర సమన్వయకర్త పుత్తా ప్రతాప్ రెడ్డి అన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం జరిగిన తూర్పు గోదావరి జిల్లా జగనన్న సచివాలయ కన్వీనర్లు మండల ఇన్‌చార్జిల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం, వైఎస్సార్ సీపీ చేపట్టే కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేర్చే కార్యక్రమానికి గృహ సారథులే ప్రధాన సాధకుల వుతారని చెప్పారు. రాష్ట్రంలో కోటీ 80 లక్షల ఇళ్లు ఉండగా.. 5.20 లక్షల మందితో జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల వ్యవస్థ ఏర్పాటైందని చెప్పారు. ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు చేరుతున్నాయో లేదో గృహసారథులు పర్యవేక్షించి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ ఇన్‌చార్జిల దృష్టికి తీసుకువస్తారని వివరించారు. పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని ఆయా ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిల సమన్వయంతో సమర్థంగా అమలు చేస్తారని చెప్పారు. ఈ వ్యవస్థ పనితీరును ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తమ ద్వారా ఎప్పటికప్పుడు నేరుగా పర్యవేక్షిస్తారని ప్రతాప్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజల మనసులను గెలుచుకోవడం ద్వారా వచ్చే ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాల్లోనూ విజయం (వైనాట్ 175) సాధించడమే లక్ష్యంగా గృహ సారథుల వ్యవస్థ పని చేస్తుందని చెప్పారు. జిల్లా స్థాయి జేసీఎస్ మండల ఇన్‌చార్జిల సమావేశం అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హత కల్గిన ఆఖరు వ్యక్తి వరకూ చేరుతున్నాయో లేదో జేసీఎస్ కన్వీనర్లు, గృహ సారథుల వ్యవస్థ పర్యవేక్షిస్తుందని చెప్పారు. ప్రభుత్వ పరంగా వీటి పర్యవేక్షణకు వలంటీరు వ్యవస్థ పని చేస్తుండగా, మరోపక్క బాధ్యత కలిగిన పార్టీ కార్యకర్తలతో కూడా పర్యవేక్షించాలని నిర్ణయించామన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజలకు మంచి జరుగుతోందా, ఇంకా ఎక్కడైనా లోపాలున్నాయా అనేది గుర్తించి, వాటిని సరిదిద్దుకునేందుకు ఈ వ్యవస్థ తోడ్పడుతుందన్నారు. ప్రతి వలంటీర్ క్లస్టరులో పార్టీకి, ప్రజలకు మధ్య వారధులుగా గృహ సారథులు పని చేస్తారని రాజా పేర్కొన్నారు. సమావేశంలో హోం మంత్రి తానేటి వనిత, వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎంపీ మార్గాని భరత్‌రామ్, అనపర్తి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి, పార్టీ రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, జిల్లాలోని అన్ని మండలాల జేసీఎస్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా. చిత్రంలో పుత్తా ప్రతాప్‌రెడ్డి, మంత్రి వనిత, ఎంపీలు బోస్, మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యేలు సత్తి సూర్యనారాయణరెడ్డి, తలారి వెంకటరావు తదితరులు

ఏనాడూ పోరాడని వ్యక్తి విమర్శలు చేయడమా

సూర్యనారాయణ వైఖరిపై ఎన్‌జీవో జిల్లా సంఘం ఆగ్రహం

కాకినాడ సిటీ: నిరంతరం ఉద్యోగుల ప్రయోజనాలు, హక్కుల సాధనకు పోరాడుతున్న తమ సంఘాన్ని ఏపీ జీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ విమర్శించడాన్ని ఏపీ ఎన్‌జీవో సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యవర్గం తీవ్రంగా ఖండించింది. కాకినాడలోని ఏపీ ఎన్‌జీవో భవన్‌లో జిల్లా కార్యవర్గం అత్యవసర సమావేశం శనివారం సాయంత్రం నిర్వహించారు. ఇందులో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. సూర్యనారాయణ అడ్డదారుల్లో రూసా రూల్స్‌కు విరుద్ధంగా సంఘానికి గుర్తింపు తెచ్చుకుని, ఉద్యోగుల సమస్యలపై పోరాడకుండా.. 70 ఏళ్ల చరిత్ర ఉన్న ఏపీ ఎన్‌జీవో సంఘాన్ని విమర్శించడం ఎంతవరకూ సమంజసమని నేతలు ప్రశ్నించారు. ఎన్‌జీవో సంఘం పూర్వ నేతలు సాధించిన కారుణ్య నియామకం జీవోలో ఉద్యోగం పొంది, ఆ ఫలాల్ని అనుభవిస్తూ అదే సంఘాన్ని విమర్శించడం ఆయన విజ్ఞతకే వదిలి పెడుతున్నామని పేర్కొన్నారు. ఏపీ ఎన్‌జీవో సంఘం అహర్నిశలూ ఉద్యోగుల ప్రయోజనాల పరిరక్షణకు, హక్కుల సాధనకు పోరాడుతుందని చెప్పారు. ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవులు, జీపీఎఫ్ లోన్లు, కరువు భత్యం చెల్లించాల్సిందిగా ప్రభుత్వాన్ని తమ సంఘం డిమాండ్ చేసిందన్నారు. ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు జి.రామ్మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, కోశాధికారి వై.పద్మమీనాక్షి, సహాధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు సరెళ్ల చంద్రరావు, కేవీఎస్ ప్రసాద్, సంయుక్త కార్యదర్శులు ఎన్వీకే ప్రసాద్, ఎన్.వీరబాబు, బి.శ్రీనివాసరావు, కాకినాడ పట్టణ అధ్యక్షుడు ఎస్కే అజీజ్, కార్యదర్శి ఎ.సత్తిరాజు తదితర నాయకులు పాల్గొన్నారు.


అత్యవసర సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎన్‌జీవో అసోసియేషన్ నేతలు